

జగనన్నకు చెబుదాంలో 227 వినతులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి 227 వినతులు అందాయి. వీటిలో అత్యధికంగా రెవిన్యూ శాఖకు 166 వినతులు వచ్చాయి. డిఆర్‌ఒ అనిత, ఆర్‌డిఒ సూర్య కళ, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, సుదర్శనదొర, సుమబాల తదితరులు స్వీకరించారు.

ఓటుహక్కుపై అవగాహన పెంచాలి

స్పందన అనంతరం ఓటు హక్కుపై అవగాహన కోసం సోషల్ వర్కర్ కె.సన్యాసి రాజు రచించిన పుస్తకాన్ని డిఆర్‌ఒ ఆవిష్కరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరులే పాలకులని, పౌరుడు, ప్రజాస్వామ్యం పరస్పర సంబంధానికి మూలం ఓటు హక్కని డి.ఆర్.ఓ తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై పతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.





సిఐటియు నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

మున్సిపల్ కార్మికుల కలెక్టరేట్ ముట్టడి

ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ రాస్తారోకో • 16 మంది కార్మికుల అరెస్టు...విడుదల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. 1వ పట్టణ సిఐ బి.వెంకటరావు, ఎస్ఐ అశోక్ పర్యవేక్షణలో పోలీసులు బలవంతంగా ఈడ్చుకుపోయి 16 మంది సిఐటియు నాయకులను, కార్మికులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు కడుపు మండి 14 రోజులుగా సమ్మె చేస్తే ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని అన్నారు. పారిశుధ్య కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న జీతం, ఆరోగ్య భృతి కలిపి రూ.21వేలు జీతంగా చెల్లిస్తామని ప్రకటించారని దీనివల్ల కార్మికులకు కలిగే ప్రయోజనం లేదని, మరో రూ.3వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, పంప్ హౌస్ కార్మికుల సమస్యలను దాటవేశారని, జీవో నెంబర్ 30ను సవరించి స్కిల్డ్, సెమిస్కిల్డ్, అన్ స్కిల్ వేతనాలతో పాటుగా రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, పంపు హౌస్ కార్మికులకు మెన్, మెటీరియల్ వేరు చేసి ఆప్కాస్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతవరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ముట్టడికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.త్రినాథ్ మద్దతు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో పి.శంకర్రావు, ఎ.జగన్మోహన్‌తో పాటు కిల్లంపల్లి రామారావు, భాస్కరరావు, బాబూరావు, గౌరీ, రామారావు, కుమారి, రమా, గౌరీ , నాగమ్మ, రాధ, దుర్గారావు, హరిబాబు, శ్రీను, గౌరీ, తదితరులు ఉన్నారు. ముట్టడిలో రాజాం ,బొబ్బిలి, నెల్లిమర్ల ,విజయనగరం మున్సిపల్ కార్మికులతో పాటు ఇంజినీరింగ్ విలీన ప్రాంత కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద బైఠాయించిన మున్సిపల్ కార్మికులు, నాయకులు

బద్నాం చేయబోయి భంగపాటు

- బెడిసికొట్టిన ఎమ్మెల్సీ రఘురాజు వ్యూహం
- మాట్లాడేందుకు అవకాశం ఇవ్వని బొత్స
- సొంత పార్టీలోనే వెన్నుపోట్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు బ్రేక్ వేసేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్సీ రఘురాజు మరోసారి భంగపాటుకు గురయ్యారు. మంత్రి బొత్స కనీసం మాట్లాడేందుకు కూడా అవకాశం ఇవ్వకపోవడంతో ఆయన వ్యూహం బెడిసికొట్టినట్లైంది. పైగా రఘురాజు ఏ ఎమ్మెల్యేపైన ఫిర్యాదు చేయడానికి వెళ్లారో... అదే ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నేరుగా మంత్రి బొత్స ఇంట్లోకి వెళ్లడం, మంత్రితోపాటు ఆయన సతీమణి, మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి కూడా కలిసి వచ్చారు. వెనుక వచ్చిన ఎమ్మెల్సీ కళ్లెదుటగానే మంత్రితో మాట్లాడి తిరిగి వచ్చిన ఇంకా కిందే నిరీక్షించడం, తీరా బొత్స బయటకు వచ్చాక కూడా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడం అందర్నీ ఒకింత ఆశ్చర్యానికి గురిచేసింది. సోమవారం మంత్రి నివాసం వద్ద చోటుచేసుకున్న ఈ సన్నివేశ దృశ్యం చర్చ నీయాంశంగా మారింది.

సుమారు రెండేళ్లుగా ఎస్.కోట ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు వ్యతిరేకంగా ఎమ్మెల్సీ రఘురాజు ప్రత్యేక శిబిరాన్ని నడుపుతున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభానికి వచ్చినప్పుడు కూడా 'నీకు ఏం తక్కువ చేశాను' అంటూ రఘురాజును సిఎం జగన్మోహన్‌రెడ్డి సుతిమెత్తగా హెచ్చరించారు. అప్పట్లో ఈ వార్త జిల్లాలో హాట్‌టాపిక్‌గామారి రాజకీయవర్గాల్లో సంచలనం రేపింది. ఆ తరువాత కూడా పరిస్థితి మారలేదు. కొంతమంది సర్పంచులు, ఎంపిటిసి సభ్యులతో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సమావేశాలు ఏర్పాటు చేయడం, ఆయా సందర్భాల్లో బొత్స హెచ్చరించడం, వాటిని ఎమ్మెల్సీ అర్థాంతరంగా రద్దుచేసుకోవడం వంటి పరిణామాలు విధితమే. తాజాగా ఎమ్మెల్యేకు సీటు ఇస్తే పార్టీ నష్టపోతుందంటూ వెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎస్.కోట ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు తదితరులను వెంటబెట్టుకుని జిల్లా పార్టీ సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావును కలిశారు. ఆ తరువాత వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డిని కూడా కలిసి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే పరిశీలనగా మంత్రి బొత్సను సోమవారం కలిసి మరోసారి వ్యతిరేక ప్రదర్శించేందుకు తన అనుచరులతో కలిసి పథకం రూపొందించుకున్నారు. ఇందుకోసం ముందు రోజే మీడియాకు కూడా సమాచారం అందించారు. ప్రచురితం ఉదయం 8గంటలకు మంత్రి బొత్సను కలవబోతున్నట్లుగా పక్కా సమాచారం కూడా ఇచ్చేశారు. ఏదో రాజకీయ వాతావరణం వేడెక్కబోతుందనే వాతావరణం సృష్టించారు. దీంతో, మీడియా అటువైపు ఓ కన్నేసి ఉంచింది. తీరా ఎమ్మెల్సీ తన అనుయాయులతో మంత్రి ఇంటి కింద పోర్టికోలో నిరీక్షిస్తుండగానే ఎమ్మెల్యే కడుబండి మంత్రి ఇంట్లోకి ఎంట్రీ ఇచ్చారు. తిన్నగా మంత్రి వద్దకు వెళ్లి, మంత్రి సతీమణి, మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మితో సహా చర్చించుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. వ్యతిరేకగ్రూపు పక్కన ఉంటుండగానే మీడియాతో మాట్లాడుతూ ఈసారి కూడా ఎస్.కోట ఎమ్మెల్యే టిక్కెట్ తనకేనని, నాలుగు నెలల క్రితమే వైవి సుబ్బారెడ్డి ప్రకటించారని, తాజాగా మంత్రి బొత్స కూడా అభయం ఇచ్చారని చెప్పారు. వ్యతిరేకవర్గం కార్యకలాపాలపై మీడియా ప్రశ్నించగా ఎన్నికల్లో అవకాశం లేనివారు అలాంటి ప్రయత్నాలు చేస్తూనే ఉంటారని, అటువంటివారిని తాను పట్టించుకో బోనని చెప్పారు.

ఈ పరిణామం అక్కడేవున్న రఘురాజు అనుచరులను కూడా నిరాశకు గురిచేసింది. మరోవైపు ఆ కొద్దిసేపట్లో ఇంటి నుంచి బయటకు వచ్చిన మంత్రి బొత్స కూడా రఘురాజుతోగానీ, ఆయన అనుచరులతోగానీ మాట్లాడలేదు. పరిస్థితిని అర్థం చేసుకున్న రఘురాజు మంత్రితో వాహనం ఎక్కివెళ్లిపోయారు. ఆయన వెంట వచ్చిన అనుచరులు ఇంటిబాట పట్టారు.



చిట్టంపాడుకు రూ.10.4 కోట్లతో పక్కారోడ్డు

పంచాయతీరాజ్ ఎస్ఇ రమేష్ గుప్తా

ప్రజాశక్తి-విజయనగరం

ఎస్.కోట మండలంలో గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడుకు ప్రధానమంత్రి జన్‌మన్ (ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయమహా అభియాన్) పథకం ద్వారా పక్కా రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌శాఖ ద్వారా ప్రతిపాదనలు రూపొందించామని ఆ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ జిఎస్ఆర్ గుప్తా తెలిపారు. విశాఖ-అనంతగిరి-అరకురోడ్డు నుంచి శనగపాడు, చిట్టంపాడు మీదుగా ప్రధాన గ్రామమైన గూనపాడు వరకు 10.2 కిలోమీటర్ల రోడ్డును రూ.10.4 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు ప్రతిపాదించడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేరకు ఈ ప్రతిపాదనలు సిద్ధంచేశామని, రెండు రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపుతామని తెలిపారు. చిట్టంపాడు గ్రామ జనాభా వందలోపు వుండటంతో పిఎం గ్రామ సడక్ యోజన కింద ప్రతిపాదించడానికి సాధ్యం కాలేదని పేర్కొన్నారు. ఆదివాసీ గ్రామాలకు మౌళిక వసతులు కల్పించేందుకు ఉద్దేశించిన పిఎం జన్‌మన్ ద్వారా ఈ రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తామని పేర్కొన్నారు.

10 నుంచి మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు

పోటీల నిర్వహణకు ఒక్కో మండలానికి రూ.25 వేలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా మండల స్థాయి పోటీలు ఈనెల 10 నుంచి అన్ని మండలాల్లో ప్రారంభం కానున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ వెల్లడించారు. అన్ని మండలాల్లో గ్రామస్థాయి పోటీలు ఇప్పటికే పూర్తయ్యాయని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ సోమవారం ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్‌లు, ప్రత్యేక అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించి ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణపై సమీక్షించారు. మండల స్థాయి పోటీల నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఒక్కో మండలానికి రూ.25 వేలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. మండలస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులందరికీ టీ-షర్టులు, టోపీలు అందజేయాలన్నారు. పోటీలు నిర్వహించే అన్ని క్రీడా మైదానాల వద్ద తాగునీటి సదుపాయం, ప్రాథమిక వైద్యం, పారిశుధ్యం, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పించాలన్నారు.



గురజాడ స్కూలులో విద్యార్థినుల కోలాట నృత్యాలు

ఘనంగా సంక్రాంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకొని గురజాడ, ఫోర్టుసిటీ పాఠశాలల్లో సోమవారం సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భోగి మంట, సంక్రాంతి ముగ్గులు , సంక్రాంతి అలంకరణలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దులు, కోలాటం , కూచిపూడి , భరత నాట్యం , రైతు వేషధారణలు వంటి కార్యక్రమాలు విద్యార్థులు నిర్వహించారు. గురజాడ స్కూలులో నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులను ముఖ్య అతిథి డైరెక్టర్ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ , డాక్టర్ విఎస్ ప్రసాద్, ప్రత్యేక అతిథి ప్రభాకర్ రావు అందజేశారు. కార్యక్రమంలో జక్కు రామకృష్ణ, కరస్పాండెంట్ ఎం.స్వరూప , ప్రధానోపాధ్యాయులు పూడి. శేఖర్ , ఎఒ నాయుడు పాల్గొన్నారు

ఫోర్టు సిటీ స్కూల్లో...

ఫోర్టు సిటీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. సంక్రాంతి పండగ ప్రాముఖ్యతను, పండుగ జరుపుకునే విధానాన్ని విద్యార్థులు నృత్యరూపంలోను, నాటికల రూపంలోను ప్రదర్శించారు. విద్యార్థులు హరిదాసు, సోదెమ్మ వేషాలు అందరినీ ఆకట్టుకున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు కూడా నృత్యంలో పాల్గొని సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. సంబరాల్లో పాఠశాల చైర్మన్ కె.ఎ.పి. రాజు(శివ), వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్ రేయినా ఖాన్, డైరెక్టర్లు మధు అశోక్, నీలిమ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్రశిక్షలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ను రెగ్యులర్ చేయాలని,కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె సోమవారం కొనసాగింది. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన శిబిరంలో ఉద్యోగులు పాల్గొని నిరసన తెలిపారు. పోరాటానికి టిడిపి నియోజకవర్గ ఇంచార్జి అతిథి గజపతిరాజు, ట్రేడ్ యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి జగన్ నియంతలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులను బెదిరించి సమ్మెను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేయడం అన్యాయమన్నారు.



సమ్మెకు మద్దతుగా మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రభుత్వం మాకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. సమ్మెకు జనసేన నాయకులు పాలవలస యశస్వి పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగుల జెఎసి నాయకులు గురువులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు 'ధీరా' అండ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉద్యోగాల సాధనే ధ్యేయంగా చదువుకుంటున్న నిరుద్యోగులకు ధీరా ఫౌండేషన్ అండగా నిలుస్తుందని ధీరా ఫౌండర్ డాక్టర్ బొత్స సందీప్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రూప్స్ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ ను అందజేశారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి ద్వారా పుస్తకాలను అందజేశారు. నిరుద్యోగులంతా వినియోగించుకోవాలని ఆయన కోరారు

ధాన్యం కొనుగోలులో అక్రమాలను నివారించాలి

కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ధాన్యం కొనుగోలులో అక్రమాలను నిరోధించాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు ఎం.గోపాలం, బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ మిల్లర్ల దోపిడీ, అక్రమాలు, కొంతమంది క్షేత్ర స్థాయి అధికారుల అలసత్వం వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని అన్నారు. ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా ఆచరణలో ఆర్‌బికెలలో గాని, రైతు కల్లాలు వద్ద గాని తూకం జరగడం లేదన్నారు. రైతుల వద్ద మిల్లర్లు క్వింటాకు పది కేజీలు వరకు అందనంగా తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఒక క్వింటా వద్ద రూ.200 వరకు నష్టపోతున్నారని తెలిపారు. ఆర్‌బికె లోనే ధాన్యం కొనుగోలు నిబంధన టెస్టులు చేసి టెస్ట్ రిపోర్ట్ ప్రకారం ధాన్యం మిల్లరుకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారుర. ఈ-క్రాప్ లేని వారికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి నేరుగా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.అధినారాయణ మూర్తి, సిరికి శ్రీరామ్మూర్తి, ఈదుబిల్లి అప్పారావు, చంద్రరావు, కృష్ణనాయుడు రైతులు పాల్గొన్నారు



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

జగనన్నా...నీకో దండం

అంగన్వాడీల వినూత్న నిరసనలు

కలెక్టరేట్ వద్ద 24గంటల నిరాహార దీక్ష

గజపతినగరంలో మంత్రి బొత్స అడ్డగింత



బొబ్బిలి : దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



కలెక్టరేట్ వద్ద టెంట్‌లో నిద్రిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-విలేకర్లు

ముఖ్యమంత్రి గారూ.. మీకు దండం పెడతాం ఎన్నికల హామీలను అమలు చేయండి అంటూ జగన్మోహన్‌రెడ్డికి దండాలు పెడుతూ అంగన్వాడీలు బొబ్బిలి, ఎస్.కోటలో నిరసన తెలిపారు. కలెక్టరేట్ వద్ద 24గంటల నిరవధిక దీక్షలు చేపట్టారు. మరోవైపు గజపతినగరంలో రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణను అంగన్వాడీలు అడ్డగించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్ చేశారు.

విజయనగరం టౌన్ : సమస్యలు పరిష్కరించాలని 28రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు సోమవారం కలెక్టరేట్ వద్ద 24గంటల నిరాహారదీక్ష చేపట్టారు.కనీస వేతనాలు అమలు చేయాలని,గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరి పోరాటానికి విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు వచ్చి మద్దతు తెలిపారు. టిఎన్‌టియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియు నాయకులు సంఘీభావం తెలిపారు. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం అత్యంత దారుణమన్నారు. కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ, యుఎస్ రవికుమార్, రెడ్డి శంకరరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దిగొచ్చేవరకు సమ్మె కొనసాగుతుందని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

గజపతినగరం : మెంటాడ మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవానికి వెళ్లి వస్తున్న మంత్రి బొత్స కాన్వాయ్‌ను గజపతినగరంలో అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. కారు దిగిన బొత్సకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, పాజెక్ట్ అధ్యక్షులు ఎం.సుభాషిని, సిఐటియు నాయకులు జి.శ్రీనివాస్ ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రదానమైన జీతం సమస్యను పక్కన పెట్టి మిగతా వాటిని పరిష్కరించామని చెప్పడం సరైనది కాదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులం కాని తమపై ఎస్మా ప్రయోగించడం, సంక్షేమ పథకాలు తీసివేయడం సరైనది కాదని అంగన్‌వాడీలు ఆవేదన చెందారు. ధరలు విపరీతంగా పెంచి జీతాలు పెంచక పోతే బతకడం ఎలాగని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కారం దిశగా మంత్రి మాట్లాడకపోవడంతో సమ్మె కొనసాగుతుందని అంగన్వాడీలు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ నాయకులు నారాయణమ్మ, త్రివేణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలంతా ముఖ్యమంత్రికి దండాలు పెడుతూ వినూత్న నిరసన తెలిపారు. ఈసందర్భంగా అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, నిర్మల మాట్లాడుతూఎస్మా చట్టాన్ని వెనక్కి తీసుకుని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. **శృంగవరపుకోట :** ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్వాడీలంతా ప్రభుత్వానికి పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు డి.జయలక్ష్మి, దంతేశ్వరి, వి.మాణిక్యం, డి.సుశీల తదితరులు పాల్గొన్నారు. **చీపురుపల్లి :** అంగన్వాడీలంతా సమ్మె కొనసాగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనియన్ నాయకులు బలగ నాగమణి మాట్లాడారు.

బుద్ధిగడ్డి తిని ఓటేశాం

భోగాపురం : బుద్ధి గడ్డి తిని మీ పార్టీకి ఓటు వేసి ఇప్పుడు గడ్డి తింటున్నామని అంగన్వాడీలంతా నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి సూర్యనారాయణ, యూనియన్ నాయకులు కొర్లమ్మ, శ్రీదేవి, అనిత, ప్రవీణ పాల్గొన్నారు. **జామి :** తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన శిబిరంలో కార్యకర్తలు పలు ఆటలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినట్లు ప్రకటించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కనక మహాలక్ష్మి, కృష్ణమ్మ, సిఐటియు నాయకులు గాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. **గంట్యాడ :** మండల కేంద్రంలో అంగన్వాడీల సమ్మె కొనసాగింది. ప్రభుత్వ మొండివైఖరి నశించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనసూయ, ప్రాజెక్టు అధ్యక్షులు పి.కుమారి, కార్యదర్శి ఎం. కళాకుమారి, గౌరవాధ్యక్షులు ఎ.హైమావతి పాల్గొన్నారు



భోగాపురం : గడ్డితింటూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



కలెక్టరేట్ వద్ద దీక్షకు మద్దతు తెలుపుతున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

పోలియో రహిత సమాజమే లక్ష్యం

బొబ్బిలి: పోలియో రహిత సమాజాన్ని స్థాపించేందుకు అంతర్జాతీయ రోటరీ సంస్థ పని చేస్తుందని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జెసి రాజు, వారాణసి శ్రీహరి అన్నారు. రోటరీ కార్యాలయంలో సోమవారం పోలియో నివారణ స్టిక్కర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలియో నివారణకు రోటరీ క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో పని చేస్తుందన్నారు. ప్రపంచ దేశాల్లో రోటరీ కృషి వల్ల 99.9 శాతం వరకు పోలియో నివారణకు పని చేశామన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల్లో మాత్రమే పోలియో వైరస్ ఉందని, ఆయా దేశాల్లో పోలియో నివారణకు పని చేస్తున్నట్లు చెప్పారు. పోలియో నివారణకు రోటరీ సంస్థకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కోశాధికారి ఎస్.శ్రీనివాస్, సభ్యులు ప్రవీణ్ కుమార్, శంకరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

'రా కదలి రా' సభను జయప్రదం చేయాలి

రామభద్రపురం: ఈ నెల 10న బొబ్బిలి టౌన్ రాజా కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న చంద్రబాబునాయుడు' రా కదలి రా' సభను జయప్రదం చేయాలని నియోజక వర్గ ఇన్‌ఛార్జి బేబీనాయన పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో బేబీ నాయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా టిడిపికి అనుకూల పవనాలు వీస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపికి ప్రజలు బ్రహ్మరథం పడతారన్నారు. ఇటువంటి తరుణంలో బొబ్బిలిలో నిర్వహించ నున్న సభకు అశేష జనవాహిని తరలి వచ్చేలా కార్యకర్తలు, అభిమానులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే బాడంగి, తెర్లాం, బొబ్బిలి మండలాల నుంచి వచ్చే సంఖ్యా బలం వేలల్లో ఉన్నట్లు సంకేతాలు వస్తున్నాయని అదే మాదిరిగా ఇక్కడ నుంచి కూడా అధికంగా ప్రజలను తరలించాలనీ కోరారు. ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు కరణం విజయ భాస్కరరావు, సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వికలాంగుల క్రీడా పోటీల్లో సత్తా

రామభద్రపురం: వికలాంగుల జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో కీర్తి ప్రియ సత్తాచాటి మండలానికి కీర్తి ప్రతిష్టలు తీసుకు వచ్చిందని ఎంఇఒ తిరుమల ప్రసాద్ కొనియాడారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లా కేంద్రం విజయనగరంలో గల రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జిల్లా స్థాయి వికలాంగుల క్రీడా పోటీల్లో ఇక్కడ భవిత కేంద్రంలో చదువుతున్న కీర్తిప్రియ సాఫ్ట్ బాల్ పోటీలో ప్రథమ స్థానం, 50 మీటర్ల పరుగు పోటీలో ద్వితీయ స్థానం, స్లోవాక్ పోటీల్లో తృతీయ స్థానం సాధించి జిల్లా స్థాయిలో సత్తాచాటిందన్నారు. భవిత ప్రత్యేక ఉపాధ్యాయులు చింతల రాజేశ్వరి ఈమెను ప్రోత్సహిస్తూ ఇచ్చిన స్ఫూర్తితో సత్తా చాటిందన్నారు. కీర్తిని ఎంఇఒ తిరుమల ప్రసాద్, పెంటయ్య, ఎంపిపిఎస్ శ్రీరామ్ నగర్ కాలనీ హెచ్ఎం శివరాం నాయుడు, ఐఇఆర్‌టి తేజస్విని అభినందించారు.

కూరగాయల అమ్మకానికి స్టాల్స్

డెంకాడ: మండల కేంద్రంలోని ఎంఎస్ కార్యాలయం ఆవరణలో సోమవారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిసిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను అమ్మకానికి స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం విజయలక్ష్మి, ఎపిసిఎన్ఎఫ్ ఈశ్వర్రావు, సీసీలు సూరి, నాని, సత్యనారాయణ, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

కలర్ ప్రింటర్ వితరణ

బాడంగి: స్థానిక వికలాంగుల వసతి కేంద్రానికి రామభద్రపురం మండలం బుసాయవలసకు చెందిన శ్రీవేంకటేశ్వర బోర్వెల్స్ అధినేత మచ్చెల్ల శ్రీను, అనూష దంపతులు రూ.15 వేలు విలువగల కలర్ ప్రింటర్‌ను అందించారు. ఈ మేరకు సోమవారం హెచ్ఎం దత్తి సత్యనారాయణ ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ వికలాంగ విద్యార్థుల అవసరాల కోసం కలర్ ప్రింటర్ వితరణ చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. గతంలో కూడా పాఠశాలకు 25 కుర్చీలు వితరణ చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయాణ భత్యం నిధులు దుర్వినియోగం

రామభద్రపురం: ప్రయాణ భత్యం నిధులు లక్షల్లో దుర్వినియోగ అవుతున్నాయని దీనిపై ఆర్టీ యాక్ట్ ద్వారా పూర్తి వివరాలను సేకరించామని మిర్తివలసకు చెందిన గిరడ షణ్ముఖరావు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ మండలంలో ఏ గ్రామానికి వెళ్ళినా మండల కేంద్రం నుంచి 20 కిలోమీటర్లు దాటదని అటువంటిది ఇక్కడ నుంచి కూత వేటు దూరంలో ఉన్న గ్రామాలకి ప్రయాణం చేసే దూరాలకు కూడా 3రెట్లు కిలోమీటర్ల దూరం చూపి నిదులను ఎంపిడిఒ విడుదల చేసుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇలా మొత్తం గత రెండు సంవత్సరాలుగా సుమారు రూ.6.58లక్షలు ప్రైవేట్ కారు వాడినట్లు చూపి దోచుకున్నారని ఆరోపించారు. ఈ దోపిడీ అంతా ఎంపిడిఒ రమామణి హయాంలోనే జరిగిందన్నారు. దీనిపై ఆర్‌టిఐ యాక్ట్ నుంచి సమాచారం వచ్చిందని చెప్పారు. కారు అద్దె పేరిట విడుదలైన బిల్లులు మొత్తాలను విలేకర్లకు చూపించారు. దీనిపై ఎంపిడిఒ వివరణకు ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

కంచి పరమాచార్యులకు సంగీత నీరాజనం

చంద్రబాబుతోనే అభివృద్ధి

విజయనగరం కోట: చంద్రబాబుతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి జరుగుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అతిథి గజపతిరాజు అన్నారు. టిఎన్‌టి యుసి రాష్ట్ర అధ్యక్షులు గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో టెక్కలి నుంచి కుప్పం వరకు చేస్తున్న 'కార్మిక చైతన్య బస్సు యాత్ర' సోమవారం విజయనగరం కోట జంక్షన్ కు చేరుకున్న సందర్భంగా ఆమె పాల్గొన్నారు. ముందుగా కోట జంక్షన్‌లో గల ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన పార్టీ నాయకులు, అనంతరం జంక్షన్‌లో భవన నిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం బాలాజీ జంక్షన్ డా బి.ఆర్. అంబెద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కలెక్టరేట్‌వద్ద అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, టిఎన్‌టియుసి అధ్యక్షులు విక్రమ్ జగన్నాథం, ప్రధాన కార్యదర్శి రౌతు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఐవిపి రాజు, పట్టణ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్, ఆల్తి బంగారుబాబు, కర్రోతు నర్సింగరావు, జిల్లా కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-భోగాపురం

జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని సోమవారం మిరప వెంకటేష్ (20) యువకుడు మృతి చెందాడు. భోగాపురం గ్రామంలోని పెద హరిజన పేటకు చెందిన వెంకటేష్ ద్విచక్ర వాహనంపై నాతవలస వైపు నుంచి భోగాపురం వస్తుండగా మార్గమధ్యంలోని నేతి విందు హోటల్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కృష్ణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

100 మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని గరికిపేటలో 100 అక్రమ మద్యం బాటిళ్లను పోలీసుల పట్టుకున్నారు. గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ పి. నారాయణరావు తన సిబ్బందితో కలిసి సోమవారం దాడులు చేశారు. పట్టుబడిన మద్యం బాటిళ్లు, నిందితున్ని పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడు దుర్మరణం

బొబ్బిలి: మండలంలోని దిబ్బగుడివలస రైల్వే గేటు సమీపంలో పార్వతీపురం నుంచి విజయనగరం వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొని వృద్ధుడు దుర్మరణం చెందారు. మున్సిపాలిటీలోని గొల్లపల్లి కాలనీకు చెందిన చింతల త్రిమూర్తులు (75) రైలు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. త్రిమూర్తులు మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపిస్తున్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న కాలనీలో దర్జాగా కబ్జా

● ఆక్రమిస్తున్న అధికార పార్టీ నేత ●సహకరిస్తున్న రెవెన్యూ అధికారులు ●ఇళ్ల స్థలాలు కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

ప్రజాశక్తి - గుర్ల

మండలంలో గూడెం రెవెన్యూ పరిధిలో భూకబ్జాలు మితిమీరుతున్నాయి. సుమారు 3.50 ఎకరాల విస్తీర్ణం గల రామదుల చెరువుని కబ్జా చేశారు. అక్కడితో ఆగకుండా ప్రస్తుతం జగనన్న కాలనీలో పేదలకు కేటాయించిన ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమిస్తున్నారు. ఈ రెండింటిని ఒకే వ్యక్తి ఆక్రమించడం గమనార్హం. దీనికి రెవెన్యూ సిబ్బంది అమ్యామ్యాలు పుచ్చుకుని సహాయ సహకారాలు అందిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

గూడెం రెవెన్యూలో సర్వే నెంబర్ 347/6లో సుమారు ఎకరా ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు -పేదలందరికీ ఇళ్ల పథకానికి కేటాయించారు. అందులో భాగంగా గూడెం, గుజంగివలస గ్రామాల లబ్ధిదార్లకు ఇళ్లపట్టాలు అందించారు. సదరు జాగాల్లో లబ్ధిదార్లు చక్కగా ఇళ్లను నిర్మించుకున్నారు. మిగిలిన స్థలంలో రైతు భరోసా కేంద్రంతో పాటు, గూడెం పిఎసిఎస్‌కు అవసరమయ్యే భవనాలను నిర్మించారు. మరో 10 మందికి



కబ్జాకు గురైన స్థలం ఇదే

సరిపడా భూమి ఉన్నప్పటికీ, అర్హులైన పేదలకు కేటాయించలేదు. గ్రామానికి చెందిన కొంతమంది తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని స్పందనలో దరఖాస్తులు చేసుకుంటే వారికి స్థలంలేదని చెప్పి దరఖాస్తులను తిరస్కరించారు. అయితే అదే స్థలాన్ని గ్రామానికి చెందిన అధికార పార్టీ నేతకు అప్పనంగా కట్టబెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే సంబంధిత వ్యక్తిని సదరు స్థలంలో నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులు అంతర్గతంగా చెప్పినట్టు భోగట్టా. రెవెన్యూ సిబ్బంది సూచనలతో ఆ వ్యక్తి నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ కబ్జా అంతటికి స్థానిక విఆర్ఒ కీలకంగా వ్యవహరిస్తున్నట్టు సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అర్హులైన లబ్ధిదార్లు తమకు ఇల్లు పట్టాలు ఇవ్వాలని కలెక్టరు గ్రీవెన్సులో దరఖాస్తులు చేసుకుని నెలల కొద్దీ తహసీల్దారు, విఆర్ఒల చుట్టూ ప్రదక్షిణలు చేసినప్పటికీ ఆ స్థలంలో డిజిటల్ లైబ్రరీ కట్టాలని, గోడౌను నిర్మించాలని సాకులు చెప్పుకుంటూ చివరికి అధికార పార్టీ నాయకునికి అప్పనంగా కట్టబెడుతున్నారని దరఖాస్తుదార్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న కాలనీలో ఉన్న మిగులు భూమిని సర్దు బాటులకు, కబ్జాదారులకు కట్టబెట్టటం ఏమిటని అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులే విస్తుపోతున్నారు. దీంతో ప్రభుత్వ ఆశయానికి గండి పడుతోందని మరి కొంతమంది విమర్శిస్తున్నారు. ఈ భూకబ్జాపై ఉన్నతధికారులు దృష్టి సారించి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏమార్చారు..కండువా కప్పారు

మెంటాడ: పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ప్రోటోకాల్ ప్రకారం రమ్మని వైసిపి కండువా కప్పారని ఆంద్ర ఎంపిటిసి పి.అప్పలనరసమ్మ అన్నారు. సోమవారం టిడిపి పెద్దలతో కలసి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మెంటాడలో సమావేశం వుందని ఎంపిడిఒ కార్యాయం నుంచి ఫోన్ వచ్చిం దని మంత్రులు బొత్స, రాజన్న దొర, చిన్న శ్రీను వస్తున్నారు మీరు వస్తే గౌరవంగా వుంటుందని చెప్పారని అన్నారు. సెగ్మెంట్ అభివృద్ధికి అవసరమైన నిధులు కోసం అడగవచ్చని, తన తండ్రి కృష్ణ దొరకు వృద్ధాప్య పింఛన్ మంజూరయ్యిందని కబురు పంపారని ఆమె వెల్లడించారు. తీరా వెళ్ళాక తనకు వైసిపి కండువా కప్పి పార్టీలో చేరినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. తాను ఎస్‌టి ఎంపిటిసినని, స్టేజ్ మీదకు మంత్రులను, జిల్లా పరిషత్ చైర్మన్‌ను కలవడానికి తీసుకొని వెళ్లిన వైసిపి నాయకులు కలవనీయకుండా కిందకు దించేశారని చెప్పారు. అనంతరం వైసిపి కండువా కప్పి ప్రచారం చేస్తూ గొప్పలు చెప్పుకుంటున్నట్లు ఆమె ఆరోపించారు. టిడిపిని వీడే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకటరావు, నాయకులు చలుమూరి వెంకట రావు, జి.అన్నవరం, రెడ్డి ఏర్నానాయుడు, పి. గంగులు, ఎస్ గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాటిస్తే అమలు చేస్తాం : బొత్స

● మహిళల ఆత్మగౌరవం నిలిపేందుకే పథకాలు
● మంత్రులు బొత్స, పీడక
● సచివాలయం, పిహెచ్‌సి ప్రారంభం

ప్రజాశక్తి- మెంటాడ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి మాట ఇస్తే, దానిని అమలుచేసి తీరతారని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేసిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకే వారికి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం వారు ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు కొత్త పింఛన్లను, పెరిగిన పింఛన్ మొత్తాన్ని అందజేశారు. మండల కేంద్రంలో సుమారు రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రులు ప్రారంభించారు. ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతిపిత బాపూజీ, భారతరత్న బిఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం చల్లపేట గ్రామంలో రూ.కోటి, 73లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఇక్కడ సుమారు రూ.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ల్యాబొరేటరీ భవనానికి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మెంటాడలో ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి, స్థానిక శాసన సభ్యులు రాజన్నదొర మాట్లాడారు. మండలంలో పింఛన్ల సంఖ్య 6509 నుంచి 7797కి పెరిగిందన్నారు గతంలో టిడిపి ప్రభుత్వ హాయంలో 65 ఏళ్ల దాటితేనే పింఛన్ వచ్చేదని, ముఖ్యమంత్రిగా జగన్ మోహనరెడ్డి బాధ్యతలు చేపట్టాక దానిని 60 ఏళ్లకు తగ్గించారని చెప్పారు. వికలాంగత్వం 80



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు బొత్స, పీడిక, జిల్లా పరిషత్తు చైర్మన్

శాతం ఉండేదని, తమ ప్రభుత్వ హయాంలో వికలాంగత్వం 40 శాతం ఉంటే చాలు పింఛన్ మంజూరు చేస్తున్నామని తెలిపారు. ప్రతినెలా 1వ తేదీన ఇంటివద్దకే ఠంఛన్‌గా పింఛన్ పంపిస్తున్న ఘనత జగన్ మోహనరెడ్డికే దక్కిందన్నారు. యువతకు నాలుగు లక్షల ఉద్యోగాలు ఇచ్చారని, అన్ని వర్గాలకు మంచి చేస్తున్న జగన్ మోహనరెడ్డికి ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ మట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి పింఛన్లను రూ.3వేలకు పెంచి, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని అన్నారు. మహిళలు తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవడానికే వైఎస్ఆర్ చేయూత లాంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. 45 ఏళ్ల దాటిన మహిళల సంక్షేమం కోసం ఈ పథకాన్ని అమలు చేస్తుంటే, కొందరు తప్పుబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఒక్క పథకమైనా రానిరాను సభలో ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. ఇంత ధైర్యంగా ప్రజలను అడిగే ప్రభుత్వాన్ని ఇంతవరకు తాను చూడలేదని పేర్కొన్నారు. పింఛన్ల మంజూరులో గాని, సంక్షేమ పథకాల అమలో గాని ఎవరైనా ఒక్క రూపాయి అయినా లంచం తీసుకున్నారని నిరూపిస్తే తాను తల దించుకుంటానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పేదలకు, పెత్తందారులకు మధ్య పోటీ జరుగుతుందని, నిరంతరం పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల గుండెల్లో నిలిచిన వ్యక్తి, మన ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి మాత్రమేనని కొనియాడారు. దేశంలో మరి ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా, అర్హతే ప్రామాణికంగా అత్యధిక పింఛన్లు ఇస్తున్న ఘనత మన రాష్ట్రానికే దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, బొబ్బిలి ఆర్‌డిఒ సాయి, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ భాస్కరరావు, మెంటాడ ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, జెడ్‌పిటిసి ఎల్.సన్యాసప్పలనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు తాడ్డి రామచంద్రరావు, తహశీల్దార్ రామకృష్ణ, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు ఫీల్డు అసిస్టెంట్లు సస్పెన్షన్

● సామాజిక తనిఖీలో బయటపడ్డ అక్రమాలు
● అసంతృప్తి వ్యక్తం చేసిన పీడీ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మరణించినవారికి, గ్రామంలో లేని వారికి మస్తర్లు వేసి అక్రమాలకు పాల్పడ్డ పూసపాటిరేగ, రెల్లివలస ఫీల్డు అసిస్టెంట్‌లు అప్పలనాయుడు, త్రినాద్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉపాదిహామీ పీడీ ఉమా పరమేశ్వరి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 2022-23 సంవత్సరానికి సంబంధించి 1623 పనులకు గాను 2.37 కోట్లు పనులకు డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి అధ్యక్షతన ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేధిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని చెరువు పనుల్లో అవకతవకలు జరిగినట్లు నిర్ధారించి అపరాధ రుసం విదించారు. పూసపాటిరేగ ఫీల్డు అసిస్టెంటు కె. అప్పలనాయుడు పలువురు వేతనదారులు పేరిట బినామి మస్తర్లు వేయడంతో విధులు నుండి సస్పెన్సన్ చేస్తున్నట్లు



సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న పీడీ ఉమాపరమేశ్వరి

తెలిపారు. రెల్లివలస ఫీల్డు అసిస్టెంటు త్రినాదరావు పలు అవకతవకలు పాల్పడినట్లు గుర్తించారు. చనిపోయిన వ్యక్తులు పేరిట మస్తర్లు వేసి నిధులు డ్రాచేసినట్లు గుర్తించడంతో ఆయన్ను కూడా సస్పెన్సన్ చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. కుమిలిలో హౌసింగు స్కీమ్‌లో అధికంగా మస్తర్లు వేయడంతో ఫీల్డు అసిస్టెంట్‌ను మందలించారు. చల్లవానితోటతో పాటు పలు గ్రామాలలో ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు చనిపోయిన నిర్వహణకు సంబంధించి నిధులు డ్రాచేసినట్లు నిర్ధారించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ చిన్నా చితకా పొరపాట్లు ఉంటే క్షమించవచ్చుకానీ కావాలనే అక్రమాలకు పాల్పడిన వారిని సస్పెండ్ చేయడం తప్పదన్నారు. మరణించిన వారిపేరు మీద, ఊరులో లేనివారి పేరుమీద మస్తర్లు వేసి అక్రమాలకు పాల్పడడం చాలా విచారకరమన్నారు. దీనిపై మండల స్థాయి అధికార్లు పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం. రాధిక, ఉపాధిహామి పథకం ఎపిడి జనార్ధనరావు, ఉపాధిహామి పథకం విజిలెన్సు అధికారి వెంకటనాయుడు, ఎస్ఆర్పి అచ్చుతరావు, ఎపిఒ రత్నమాల, మండల జెసిఎస్ కన్వినర్ మహంతి శ్రీనివాసరావు, నాయకులు మహంతి జనార్ధనరావు, ఎడ్ల రామకృష్ణ, తాడిశెట్టి బాబు పాల్గొన్నారు.

ఇంటి బిల్లు చెల్లించండి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉంగరాడకు చెందిన పల్లి గోరీశ్వరి, చీర లక్ష్మి, చీర రాము, చీర ధనలక్ష్మిలు తాము ఇళ్లు నిర్మించి ఆరు నెలలు కావస్తున్నా ఇంత వరకూ హౌసింగ్ అధికారులు బిల్లులు చెల్లించలేదని సోమవారం ఎంపిడిఒ శ్యామల కుమారి నిర్వహించిన స్పందనకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసినప్పటికీ రెవెన్యూ వారు ఫీజిబులిటీ అందించాలని పేర్కొన్నారు. హౌసింగ్ అధికారులు వివిధ స్థాయిలో ఉన్న గృహాలు తనిఖీ చేసినప్పటికీ నేటి వరకు ఇల్లు బిల్లులు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి గృహ నిర్మాణాలు చేపట్టామని తీరా బిల్లులు రాకపోవడంతో అప్పుల వాళ్ళ వేధిస్తున్నారని వెల్లడించారు. ఇల్లు బిల్లులు తక్షణమే ఇప్పించాలని కోరారు. ఎంపిడిఒతో పాటు హౌసింగ్ ఎఇ జగన్మోహన్‌రావు ఉన్నారు.

పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తా

ప్రజాశక్తి - పూసపాటిరేగ

టిడిపికి పూర్వ వైభవం తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామినాయుడు కుమారుడు పతివాడ తమ్ము నాయుడు అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైనట్లు తెలియడంతో నియోజకవర్గంలోని పలువురు నేతలు ఆయన్ను కలసి పూలమాలలు వేసి, సాలువాలు కప్పి సోమవారం శుబాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కర్రోతు బంగారాజు, భోగాపురం టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ తమ్మినాయుడును ఆయన స్వగృహం చల్లవాని తోటలో కలసి గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా తమ్మునాయుడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు ఈ పదవిని ఇచ్చిన అధినేత చంద్రబాబు, లోకేష్‌బాబు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చంనాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన తండ్రి పతివాడ నారాయణస్వామి ఆశీస్సులతోనే ఈ పదవి తనకు దక్కిందన్నారు. కార్యక్రమంలో డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, నాయకులు ఆకిరి ప్రసాద్, మహంతి శంకరావు, పతివాడ అప్పలనారాయణ, పి.అప్పలనాయుడు, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని అక్కివరం ఎపి మోడల్ స్కూల్లో భోగి, సంక్రాంతి పండగను ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు సోమవారం ప్రారంభించారు. నేటి నుంచి పాఠశాలకు సెలవు కావడంతో వారం రోజులు ముందుగా పాఠశాలలో భోగి సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో భోగి సంక్రాంతికి సంబంధించిన వివిధ రకాల వేషధారణ నిర్వహించి భోగి మంటను వేశారు. ఈ కార్య క్రమంలో ఎంఇఒలు వెంకటరమణ, రాధాకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ సంధ్య, విద్యా కమిటీ ఛైర్మన్ ముద్దాడ రాము, గంట్లం సర్పంచ్ రమణ రాజు, పాల్గొన్నారు.

వేపాడ: మండలం కేంద్రంలోని విక్టరీ హైస్కూల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో భోగి మంటలు వేయించడంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాఘవ్, కరస్పాండెంట్ దారినాయుడు మాస్టర్, ప్రిన్సిపల్ శంకర్, శ్రీను, పాల్గొన్నారు.

జామి: మండల కేంద్రంలోని అల్లువీధి ప్రాథమిక పాఠశాలలో సంక్రాతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారి నుంచే విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాఠశాలలో నిర్వహించిన సంక్రాతి ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గెలిచిన విజేతలకు బహుమతిలను విద్యాశాఖ ధికారి చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారావు, అనూరాధ, పాల్గొన్నారు.

శంబంగి ఉండగా అభ్యర్థికి ఢోకాలేదు..

ప్రజాశక్తి- బాడంగి

ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఉండగ బొబ్బిలి నియోజకవర్గంలో వైసిపిలో ఎమ్మెల్యే అభ్యర్థికి ఢోకాలేదని జెసిఎస్ మండల ఇంచార్జ్ మరిపి శంకర్ అన్నారు. సోమవారం బాడంగి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపిలో కొందరు నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. పత్రిక ప్రకటన ఇచ్చే ముందు మీ పార్టీ అభ్యర్థి ఎవరో తెల్చికోవాలని హితవు పలికారు. నియోజకవర్గంలో టిడిపి తరుపున పోటీ చేసేందుకు ఆ పార్టీ ఇంచార్జి బేబీనాయనతో పాటు, సుజయ్ కృష్ణరంగారావు, తెంటు లక్ష్మునాయుడు ఎవరన్నది వారికే అయోమయంగా ఉందన్నారు. వైసిపిలో ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే శంబంగి చేసిన అభివృద్ధి మరోసారి వైసిపికి పట్టం కడతాయన్నారు. బొబ్బిలిలో ఇటీవలే జరిగిన బీసీ సాధికారిక బస్సు యాత్రకి వచ్చిన జనాలను చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేయడం సమంజసం కాదని తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి తెర్లి శ్రీనివాసరావు, సచివాలయం కన్వీనర్ తెంటు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

10న కోడూరులో కోలాటం పోటీలు

బాడంగి: ఈ నెల 10న కోడూరులో స్వర్ణ భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కీర్తి శేషులు తెంటు భారతమ్మ జ్ఞాపకార్థంతో సంక్రాంతి సంబరాల్లో భాగంగా కోలాటం సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తామని స్వర్ణ భారతి అధినేత తెంటు సత్యం మాస్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రదర్శనలో పాల్గొనడానికి 135 టీమ్స్ రిజిస్ట్రేషన్ చేసుకోగా స్కిల్ టెస్ట్ ద్వారా 35 టీమ్‌లను ఎంపిక చేశామన్నారు. ఎంపిక చేసిన టీమ్‌లకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తామన్నారు. పోటీలు ప్రారంభానికి ముందే వేధిక వద్దకు హాజరు కావాలని, పాల్గొన్న వారు కార్యక్రమం చివరి వరకూ ఉండాలని చెప్పారు. విబేధాలకు తావులేకుండా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

బొబ్బిలి: బాడంగి మండలంలోని కోడూరులో ఈనెల 10న కోలాటం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెంటు సత్యం నాయుడు, గేదెల కరుణకుమార్ తెలిపారు. స్వర్ణభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెంటు భారతి జ్ఞాపకార్థంగా కోలాటం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కోలాటం కళాకారులు పాల్గొని పోటీలను జయప్రదం చేయాలని కోరారు. సమయానికి ముందే పోటీలు నిర్వహించే స్థలానికి కళాకారులు చేరుకోవాలని కోరారు.

కోలగట్ల మాటలు సిగ్గుచేటు

విజయనగరం కోట : జగన్‌ను చూసి కాదు నన్ను చూసి ఓటేయండి అంటూ విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఉపాధ్యాయులను అభ్యర్థించడం సిగ్గుచేటని మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు కర్రోతు నర్సింగరావు,పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మీరు మాట్లాడారు. కోలగట్ల ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన గెట్ టు గెదర్‌లో సిఎం పని తనం కాకుండా తన పని తనం చూసి ఓటు వేయండి అని అడగడం సిగ్గుచేటు అన్నారు. మాయ మాటలు చెప్పిన సిఎం కేబినెట్ లో ఉంటూ ఇలా మాటలు అడడం విడ్డూరంగా ఉందన్నారు. అటు సిఎం చూస్తే నాయకులు, మంత్రులు పని తనం చూసి కాదు, నా పని తనం చూసి ఓటు వేయమడం విడ్డూరంగా ఉందన్నారు. ఎవరి మాటలు నమ్మాలో ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. విద్యా వ్యవస్థను సర్వనాశనం చేసి, సమయానికి జీతాలు ఇవ్వకుండా ఉద్యోగులనున నడి రోడ్డుపై నిలబెట్టిన ముఖ్యమంత్రికి ఓట్లు వేయాలా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బంగారు బాబు, కోంద్రు శ్రీనివాసరావు నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబంలో వెలుగులు

ప్రజాశక్తి - బొబ్బిలి రూరల్

తమ ప్రభుత్వంలో ప్రతి పేద కుటుంబలో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే శంబంగి చినప్పలనాయుడు అన్నారు. సోమవారం పిరిడి గ్రామంలో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకే చేరవేస్తున్న ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. అనంతరం నూతనంగా మంజూరైన, పెంచిన పింఛన్లు ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, వేణుగోపాలనాయుడు, జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, సర్పంచ్ తుట్ట వరలక్ష్మి, కమ్మవలస సర్పంచ్ పిల్లా వసుందర, కారాడ సర్పంచ్ సంజీవనాయుడు, ఎంపిడిఒ రవికుమార్, వైసిపి నాయకులు కొల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. సోమవారం పిరిడి పిహెచ్‌సిని ఆయన పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని వసతులను పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

కొత్తవలస: స్థానికి సచివాలయం-5 పరిధి చీపురువలస గ్రామంలో నూతన, పెంచిన పింఛన్లను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పింఛన్లను రూ.3వేలకు పెంచిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, జెసిఎస్ మండల ఇంచార్జి బొంతల వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, వైస్ ఎంపిపి కర్రి శ్రీను, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, వీరబద్రపురం సర్పంచ్ గేదెల త్రినాథమూర్తి, వేపాడ వైసిపి మండల అధ్యక్షుడు ముమ్ములూరి జగన్నాథం, సింగరాయి సర్పంచ్ నీరుజోగి వెంకటరావు, సచివాలయం కన్వీనర్ బంగారు శ్రీను, చీపురువలస కృష్ణ, సూరిబాబు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామభద్రపురం: ఉపాధ్యాయ, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పాఠశాల సమస్యలను, ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హైస్కూల్ ఉపాధ్యాయులలో అర్హత కలిగినవారుంటే వారిని లెక్చరర్‌లగా పదోన్నతి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగుల న్యాయ సమస్యలపై విధాన పరిషత్తులో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కామేశ్వరరావు, నాగభూషణరావు, మురళీధర్ రావు, ఎపిటిఎఫ్ గౌరవ అధ్యక్షులు జోగినాయుడు పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టనున్నామని ఇఒపిఆర్‌డి ఉమా సోమవారం తెలిపారు. 9న బొద్దాం పిహెచ్‌సి పరిధిలోనూ, 23న ఆర్ఎస్‌పేట లోనూ, 30న బల్లంకి గ్రామంలోనూ ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవకతవకలపై సర్పంచుల ధ్వజం

ప్రజాశక్తి- బొండపల్లి

రైతులు ఎంతో కష్టబడి పండించిన ధాన్యాన్ని అమ్మే క్రమంలో కొనుగోలు దారులు అవకతవకలకు పాల్పడుతున్నారని ఫలితంగా అన్నదాతలు ఎంతో నష్ట పోతున్నారని పలువురు సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. సోమవారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపిపి చల్ల చలంనాయుడు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయశాఖకు సంబంధించి మరువాడ కొత్తవలస, బి.రాజేరు, కనిమెరక సర్పంచ్‌లు మాట్లాడుతూ ధాన్యం తేమ శాతం మొదలుకొని పంటను మిల్లులకు పంపించేటప్పుడు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. రైతు వద్ద తేమ శాతం సరిపోయినపుడు మిల్లర్లు తేమశాతం అధికంగా ఉందని ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి సుమారు నాలుగు కేజీలు అదనంగా ధాన్యాన్ని తీసుకొంటు న్నారని సర్పంచ్ లు ధ్వజమెత్తారు. ప్రభుత్వం తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని స్పష్టం చేసినా వాస్త వానికి కార్యారూపం దాల్చటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలలో జలజీవన్ మిషన్‌కు సంబంధించి తాగు నీరు పూర్తి స్థాయిలో ఎప్పుడు సరఫరా చేస్తారని వేంద్రాం, మరువాడ కొత్తవలస, కిండాం, అగ్రహారం సర్పంచ్‌లు కర్రోతు శ్రీనివాసరావు, బుంగ దేవుడులు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇని ప్రశ్నించారు. మరువాడ కొత్తవలసలో తాగు నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉందని సర్పంచ్ శ్రీనివాస రావు సభ దృష్టికి తీసుకువచ్చారు. గొట్లాంలో ఉన్న ఆయుర్వేదిక్ డిస్పెన్సరీని బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించవద్దని గొట్లాం పిఎసియస్ అధ్యక్షులు మహంతి రమణ కోరారు. ఈ విషయంలో ఎంపిపి చలంనాయుడు జోక్యం చేసుకుంటూ సమస్యను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. ఎంపిడిఒ వైవి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ కార్డులు కొత్తగా మంజూర య్యాయని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సూర్యప్రకాశరావు, ఇఒపిఆర్‌డి సుగుణాకర్‌రావు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.